క్లుప్తంగా

'దివ్యాంగుల దినోత్సవాన్ని విజయవంతం చేయండి'

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని పాత మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ, జిల్లా సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో ఈనెల 23న ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని డీడబ్ల్యూవో సావిత్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని దివ్యాంగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'నిధుల వివరాలు తెలియజేయాలి'

తిర్యాణి: మండల పరిషత్ అధికారులు 15వ ఆర్థిక ప్రణాళికలకు సంబంధించిన నిధుల వివరాలను మండల పరిషత్ సభ్యులకు తెలుపకపోవడం సరికాదని గడలపెల్లి ఎంపీటీసీ సార రమేశ్ గౌడ్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట విలేకర్లతో మాట్లాడుతూ నిధుల ఖర్చుకు సంబంధించిన వివరాలను అడిగితే అధికారుల దాటవేత ధోరణిగా వ్యవహరిస్తున్నారు. ఎంపీడీవో, సీనియర్ అసిస్టెంట్లు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో సమయపాలన పాటించడం లేదని ఆరోపించారు. మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశాన్ని ఎనిమిది నెలలు గడిచినా నిర్వహించకపోవడం అధికారుల పనితీరుకు నిదర్శనమని విమర్శించారు.

సంతాజీ జగన్నాడేకు నివాళి


నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

వాంకిడి: మండల కేంద్రంలోని గాండ్ల తెలికుల సంక్షేమ సంఘ భవనంలో గురువారం సద్గురువు సంత్ శ్రీ సంతాజీ జగన్నాడే మహరాజ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల గాండ్ల తెలి కుల సంక్షేమ సంఘం నాయకులు సంతాజీ జగన్నాడే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. భజన కీర్తనలతో, భక్తి శ్రద్ధలతో కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బండె తుకారాం, సంఘం గౌరవ అధ్యక్షుడు బండె నాందేవ్ పటేల్, మండల అధ్యక్షుడు బండె బాలేష్, నాయకులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు


పెన్నులు అందజేస్తున్న మేనేజర్ సాయిచరణ్

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డిజిటల్ లావాదేవీలు, సైబర్‌నేరాలు, పొదుపు పథకాలపై తెలంగాణ గ్రామీణ బ్యాంకు రాస్పల్లి శాఖ మేనేజర్ సాయిచరణ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆన్‌లైన్ గేమ్స్‌లో విద్యార్థులు ఖాతాల వివరాలను నమోదు చేయవద్దని సూచించారు. ప్రతీ విద్యార్థి బ్యాంకు ఖాతా కలిగి ఉండాలని సైబర్ నేరాలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి జగదీష్, సీఎస్‌పీ సోమన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మెట్లపూజ

ఇచ్చోడ: మండల కేంద్రంలో విఠలేశ్వర మందిరంలో గురువారం అయ్యప్ప మెట్లపూజ నిర్వహించారు. దాదాపుగా మూడు గంటల పాటు శాస్త్రోయుక్తంగా మెట్లపూజ చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు భక్తిపాటలు పాడుతూ.. నృత్యం చేశారు. అనంతరం మహాభిక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బలరాంజాదవ్‌డ, స్వాములు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

జైనూర్: గ్రామాల్లో నిరంతరం పరిసరాల పరిశుభ్రత పాటించాలని, రోడ్లపై ఎక్కడా చెత్తా చెదారం లేకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి డి.వెంకటేశ్వర్ రావు తెలిపారు. మండలంలోని వేలాల గ్రామాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో కొనసాగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతిరోజు రోడ్లు, మురికి కాల్వలను శుభ్రం చేయాలని, గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా ఇంటింటికీ చెత్త సేకరించాలన్నారు. నర్సరీలో మొక్కల పెంపకంపై శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం డంపుయార్డును పరిశీలించి కంపోస్ట్ ఎరువు తయారీ ప్రక్రియ చేపడుతూ, కంపోస్ట్ షెడ్డు ద్వారా వచ్చే ఎరువును పల్లెప్రకృతి వనంలోని మొక్కలకు అందించాలని, చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటాలన్నారు. శ్మశానవాటిక పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు.

వంట.. తంట..!

- కట్టెల పొయ్యిలతో ఇబ్బందులు
- అనారోగ్యం తలెత్తే ప్రమాదం
- రూ.500లకే సిలిండర్ ఇవ్వాలని ఎండీఎం నిర్వాహకుల డిమాండ్


నిషాని ప్రాథమిక పాఠశాలలో కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న నిర్వాహకులు

కెరమెరి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారు చేసే వంట మనుషులు అవస్థలు పడుతున్నారు. వంట గదులు, గ్యాస్ పొయ్యిలు లేకపోవడంతో కట్టెల పొయ్యిలపైనే వంటలు చేస్తూ అష్టకష్టాలు పడుతున్నారు. వర్షాకాలంలో వారి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. మండలంలో మొత్తం 85 పాఠశాలలు ఉండగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు మూడు, ఆశ్రమ ఉన్నత పాఠశాలలు 7, ప్రాథమికోన్నత పాఠశాలలు 5, ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలు 73 ఉన్నాయి. ఇందులో 3782 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

ఒక్కో పాఠశాలలో 10 కేజీల కర్ర వినియోగం

మండలంలోని 85 పాఠశాలల్లో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. ఆశ్రమ పాఠశాలలు మినహా లోకల్‌బాడీ పాఠశాలల్లోని ఒక్కో విద్యార్థికి 100 గ్రాముల బియ్యంతో పాటు కూరలు తయారు చేస్తున్నారు. ఈ లెక్కన ప్రతీ బడికి 10 కిలోల కర్ర అవసరమవుతుంది. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారీకి టన్నుల్లోనే కర్ర వినియోగిస్తున్నారు. దీంతో ఏళ్ల తరబడి ఉన్న భారీ వృక్షాలు నేలకొరుగుతున్నాయి.


నిషానిలో నిలిచిపోయిన వంటగది నిర్మాణం

ఆరోగ్యానికి హానికరం..

కట్టెల పొయ్యి నుంచి వచ్చే పొగతో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని వైద్యులు చెబుతున్నారు. పొగ గాలిలో కలవడం ద్వారా వాతావరణం కలుషితమవుతుంది. ఈ పొగ గాలిలోని కార్బన్‌డైయాక్సైడ్‌తో కలవడం వల్ల ఓజోన్ పొర దెబ్బతినే ప్రమాదముందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. వంట తయారు చేసే వారికి పొగ ద్వారా కళ్లు, ఊపిరితిత్తులు, గొంతు, ముక్కుకు సంబంధించిన ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉన్నాయి. కొన్ని పాఠశాలలకు వంట గదులు నిర్మించినా ఇప్పటి వరకు ఎండీఎం ఏజెన్సీలకు గ్యాస్ సిలిండర్లు , పొయ్యిలు, వంట పాత్రలు పంపిణీ చేయలేదు. కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌ను మధ్యాహ్న భోజన నిర్వాహకులకు రూ.500లకు అందిస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

ఇబ్బంది పడుతున్నాం..



మధ్యాహ్న భోజనం వండేందుకు గ్యాస్ పొయ్యిలు లేక చాలా ఇబ్బంది పడుతున్నాం. వంట పాత్రలు కూడా అందించలేదు. దీంతో ఇంటి నుంచి తీసుకొచ్చి వంటలు చేస్తున్నాం. ఆరు బయట వంట ప్రమాదం కాగా, కట్టెలు కూడా లభించడం లేదు. ప్రభుత్వం రూ.500లకు గ్యాస్ సిలిండర్ అందించాలి

- మడావి భీంబాయి, భీమన్‌గొంది

ఉపాధ్యాయులు డైరీలు రాయాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో సుధాకర్

కెరమెరి: ఉపాధ్యాయులు, టీచింగ్ డైరీలు, లెస్సన్ ప్లాన్‌లు రాయాలని మండల విద్యాధికారి కుడ్మెత సుధాకర్ అన్నారు. గురువారం మండలంలోని కరంజివాడ, శంకర్‌గూడ పాఠశాలలను ఆయన సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. అన్ని రకాల రిజిస్టర్లను విధిగా నమోదు చేయాలన్నారు. విద్యార్థులకు ఇచ్చిన వర్క్ పుస్తకాలను పూర్తి స్థాయిలో ఉపయోగించాలన్నారు. మాడ్యూల్ ఆధారంగా విద్యాబోధన చేయాలని సూచించారు. సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు చదవడం, రాయడం రావాలని, టీఎల్ఎంను ఉపయోగించి విద్యాబోధన చేస్తే ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సీఎం బ్రేక్‌ఫాస్ట్‌లో ప్రభుత్వం సూచించిన మెనూ తప్పక పాటించాలని పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


కేంద్ర పథకాల క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

దహెగాం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నవీన్‌కుమార్ అన్నారు. గురువారం కేంద్ర ప్రభుత్వం వికసిత భారత్ సంకల్ప యాత్ర మండల కేంద్రంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, ఆయుష్మాన్ భారత్, అటల్ పెన్షన్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డులు తదితర పథకాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలి

ఉట్నూర్‌రూరల్: మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలని గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ వెంకటరామి రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని హస్నాపూర్ గ్రామీణ బ్యాంకు ద్వారా 25 స్వయం సహాయ మహిళా సంఘాలకు కోటి రూపాయల చెక్కు అందించారు. ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘాలు స్వయం ఉపాధిలో రాణించేందుకు గ్రామీణ బ్యాంకు కృషి చేస్తుందన్నారు. బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాల ద్వారా వ్యాపారాలు చేసుకొని ఎదగాలన్నారు. ప్రైవేట్ బ్యాంకుల వద్ద రుణాలు తీసుకొని మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉపేందర్, బ్యాంకు మేనేజర్ రాజేశ్, శ్రీనివాస్ ఆర్ఎం పూర్ణచందర్, రాజేశ్వర్, పద్మరావు సిబ్బంది పాల్గొన్నారు.

'కాంగ్రెస్ నాయకులు క్షమాపణ చెప్పాలి'


కౌటాల: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

కౌటాల: భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్‌ను అవహేళన చేసిన ఎంపీ కల్యాణ్ బెనర్జీ, కాంగ్రెస్ నాయకులు వెంటనే క్షమాపణ చెప్పాలని బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో కాంగ్రెస్ నాయకుల దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు నారులే వానుపటేల్, నాయకులు సత్తయ్య, భీమయ్య, మృత్యుంజయ్, కవిరాజ్, భీంరావు, తిరుపతి, బాలు, తదితరులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్‌ను అవహేళన చేసిన కాంగ్రెస్ నాయకులు క్షమాపణ చెప్పాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకుల తీరుపై నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతి గౌడ్, నాయకులు చాప్లె సుధాకర్, పుంజారి శ్రీమన్నారాయణ, ఎల్కులై మల్లయ్య, చౌదరి చందు, డోకె రామన్న, రౌతు లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటి అద్దె 9శాతం ఇప్పించేందుకు కృషి చేస్తాం


కైరిగూడలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

రెబ్బెన: సింగరేణి ఉద్యోగుల క్వాటర్లు తీసుకున్న వారికి మున్సిపాలిటీలో ఇచ్చిన విధంగా గోలేటి ఏరియాలో పనిచేసే కార్మికులకు 9 శాతం ఇంటి అద్దె ఇప్పించేందుకు కృషి చేస్తామని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్ రావు అన్నారు. గురువారం కైరిగూడ ఓసీపీలో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలని కాంట్రాక్టు వ్యవస్థను ప్రోత్సహించాలని చూస్తోందని విమర్శించారు. రానున్న రోజుల్లో సింగరేణి కార్మికుల హక్కుల రక్షణ కోసం ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. జాతీయ సంఘాలను గెలిపిస్తే కార్మిక హక్కులను హరించడం ఖాయమని పేర్కొన్నారు. ఈనెల 27న జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులు బాణం గుర్తుకు ఓటు వేసి టీబీజీకేఎస్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో జీఎం కమిటీ సభ్యులు చంద్రశేఖర్, రవీందర్, వెంకటేష్, ఏరియా నాయకులు సంపత్, కమిటీ సభ్యులు మురహరి, కిరణ్, సత్యనారాయణ, శ్రీనివాస్, స్వామి, రమేశ్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు రూ.26వేలు వేతనం ఇవ్వాలి


మాట్లాడుతున్న బోగే ఉపేందర్

రెబ్బెన: సింగరేణి కోల్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు కనీస వేతనంగా రూ.26వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. గురువారం గోలేటిలోని ఎక్స్ రోడ్‌లోని గోలేటి బ్రాంచి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రతి నెల 7వ తేదీన వేతనాలు చెల్లించాలన్నారు. రాష్ట్రంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణిలో పని చేస్తున్న వేలాది మంది కాంట్రాక్టు కార్మికులు చాలీచాలని వేతనాలతో పని చేస్తూ శ్రమదోపిడికి గురవుతున్నారన్నారు. సింగరేణి సంస్థ లాభాల్లోకి రావటానికి సంస్థ అభివృద్ధికి కోల్‌ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, కార్పొరేట్ వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. సంస్థకు వచ్చిన లాభాల్లో ట్రాన్స్‌పోర్టు కార్మికులకు సైతం వాటా ఇవ్వాలని, సింగరేణిలో ఖాళీగా ఉన్న క్వాటర్లకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రాంచి అధ్యక్షుడు స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి, ఉపాధ్యక్షుడు రవిప్రసాద్, కార్యదర్శి కృష్ణ నాయకులు చందు, జ్యోతిరావ్, సంతోష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పెరిగిన చలితో జాగ్రత్త..!

- జిల్లాను వణికిస్తున్న చలి
- ఉన్ని దుస్తులు, కోల్డ్‌క్రీమ్‌లకు పెరిగిన గిరాకీ


కౌటాలలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న స్వెటర్లు

కౌటాల: చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. వాతావరణంలో వచ్చిన మార్పుల ప్రభావంతో ఉదయం, రాత్రి సమయాల్లో చల్లని గాలులు వీస్తున్నాయి. తీవ్రంగా చలి పెరుగుతుండటంతో ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. చలి నుంచి ఉపశమనం పొందడానికి మండల వాసులు ఉన్ని దుస్తులు కొనుగోలు చేస్తున్నారు. చలి నుంచి రక్షణ పొందేందుకు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

రక్షణ కోసం ఉన్ని దుస్తులు..

జిల్లాలో కొద్ది రోజుల నుంచి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోవడంతో గ్రామీణ ప్రజలు చలికి వణికిపోతున్నారు. రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు జిల్లాలో నమోదవుతున్నాయి. దీంతో చలి నుంచి రక్షణ పొందేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వెచ్చదనం కోసం చెద్దర్లు, స్వెటర్లు, మంకీ క్యాప్‌లు, హ్యాండ్ గ్లౌజులు, మఫ్లర్లు, సాక్సులు, పిల్లలకు సంబంధించిన ఉన్ని దుస్తులు వంటివి కొనుగోలు చేస్తున్నారు. వినియోగదారులకు కావాల్సిన రంగుల్లో, ఆకట్టుకునే తీరుగా తయారు చేసిన ఉన్ని వస్త్రాలను ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఉన్ని దుస్తులకు భారీగా డిమాండ్ ఏర్పడింది. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లోని మార్కెట్‌లో రూ.300ల నుంచి రూ. 2000 వరకు ఉన్ని దుస్తులు లభ్యమవుతున్నాయి.

కోల్డ్‌క్రీమ్‌లపై యువత మక్కువ..

చలి నుంచి చర్మాన్ని కాపాడుకునేందుకు యువత ఎక్కువగా కోల్డ్‌క్రీమ్‌లు కొనుగోలు చేస్తున్నారు. వివిధ రకాల కంపెనీలకు చెందిన కోల్డ్‌క్రీమ్‌లు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. ముఖము, చేతులపై ఎలాంటి గీతలు(చారలు) పడకుండా పొడిబారిన చర్మం నున్నగా, నాజూగ్గా ఉండేందుకు కోల్డ్ క్రీమ్స్ వినియోగిస్తున్నారు. పెదవులు, కాళ్లు, చేతులు పగుళ్లు తేలకుండా కోల్డ్‌క్రీమ్స్ చక్కని ఫలితాలు అందిస్తాయని పలువురు పేర్కొంటున్నారు.

అందుబాటులో వాటర్ హీటర్లు..

శీతాకాలంలో చల్లటి నీటితో స్నానం చేయాలంటే ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటారు. దీంతో వాటర్ హీటర్లకు సైతం మార్కెట్‌లో గిరాకీ పెరిగింది. వాటర్ హీటర్లు రూ.1500ల నుంచి రూ.5 వేల వరకు ధర పలుకుతున్నాయి. స్టోరేజీ వాటర్ హీటర్లు 6 నుంచి 25 లీటర్ల పరిమాణం వరకు అందుబాటులో ఉండగా దాదాపు రూ.6 వేల నుంచి రూ.10వేల వరకు ధర పలుకుతున్నాయి. ఇక విద్యుత్ వినియోగంలో ఆదా కోసం 5 స్టార్స్ రేటింగ్‌తో కూడా హీటర్స్ లభిస్తుండటం విశేషం.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

చలికాలంలో చర్మ సంబంధ వ్యాధులు ఎక్కువగా వస్తుంటాయి. ప్రాణాంతకం కాకపోయిన ఇవి చిరాకు, నొప్పులు కలిగిస్తాయి. అరికాళ్లు, పెదాలు పగలడం, చర్మం తెల్లగా పొడిబారినట్లుగా మారటం వంటి లక్షణాలు ఉంటాయి. గాలిలో తేమ ఎక్కువగా ఉండటం వల్ల చర్మం బిరుసుగా ఉంటుంది. వీటి నుంచి తప్పించుకునేందుకు కోల్డ్‌క్రీమ్‌లు, నూనెలను చర్మానికి పట్టించాలి. గోరువెచ్చని నీటితోనే స్నానం చేయాలి. రాత్రి సమయాల్లో స్వెటర్లు ధరించాలి. ఐదు సంవత్సరాల లోపు చిన్నారులు నిమోనియా, జలుబు, జ్వరాల బారిన పడే ప్రమాదం ఉంది. వృద్ధులు కూడా చలితో అనేక అవస్థలు పడుతుంటారు. చిన్నారులు, వృద్ధులు ఉదయం, రాత్రి వేళల్లో బయట తిరగకపోవడం మంచిది. గర్భిణులు, బాలింతలతో పాటు థైరాయిడ్ బాధితులు సైతం తగిన జాగ్రత్తలు, మందులు తీసుకోవాలి. ఈకాలంలో ప్రతి ఒక్కరూ ఆకుకూరలు, కాయకూరలతో పాటు మాంసకృత్తులు అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఘనంగా సంఘ ఆవిర్భావ దినోత్సవం

కాగజ్‌నగర్‌టౌన్: 8వ వసంతంలోకి అడుగు పెడుతున్న తెలంగాణ రాష్ట్ర ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ (వయో వృద్ధుల సంఘం) ఆవిర్భావ దినోత్సవం కాగజ్‌నగర్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏకైక బలమైన సంఘంగా నిలిచి అనేక కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా జిల్లా, మండల, గ్రామ శాఖలను కూడా ఏర్పాటు చేశామన్నారు. అనేక విజయాలు సాధించి వయోధికుల గౌరవాన్ని పెంచిన ఘనత సంఘానికి దక్కడం సంతోషకరమని తెలిపారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి గెలిచిన వయోధికులకు బహుమతులు అందజేశారు. సమావేశానికి అధ్యక్ష, కార్యదర్శులు పూర్ణచందర్ రావు, నారాయణ, నాయకులు కలికోట రమణయ్య, ఝల్లా గౌడ్, దేవయ్య, బంగారు బాబు, మార్త ఉపేందర్, వాహబ్, తూడూరి ప్రకాశ్, రామయ్య, సీతారాం, నర్సయ్య పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన


వైద్యశిబిరం ప్రారంభిస్తున్న అహల్యాదేవి

రెబ్బెన: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం శరత్ మ్యాక్సీ విజన్ సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్యశిబిరానికి ప్రజల నుంచి స్పందన లభించింది. రెబ్బెన సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కుందారపు శంకరమ్మలు వైద్య శిబిరం ప్రారంభించారు. వైద్యశిబిరంలో 140 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్య సిబ్బంది 25 మందిని కంటి ఆపరేషన్ల కోసం రెఫర్ చేశారు. అలాగే మరో 50 మందికి అవసరమైన మందులను అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ, బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్, మేనేజర్ యాకూబ్, కోఆర్డినేటర్ వంశీ, డీపీవో శిరీషా తదితరులు పాల్గొన్నారు.

కందిపప్పులో పురుగులు


పురుగులు పట్టిన కందిపప్పు

పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు గురువారం పంపిణీ చేసిన కందిపప్పులో పురుగులు రావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, చిన్నారులకు పోషకాహారాన్ని అందించడమే లక్ష్యంగా కందిపప్పు, పాలు, గుడ్లు, బాలామృతం పంపిణీ చేస్తుంది. మూడు రోజుల క్రితం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన కందిపప్పులో పురుగులు రావడంతో మహిళలు ఆందోళన చెందుతున్నారు. నాసిరకం పప్పులు, ఆహారం సరఫరా చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఈవిషయంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనాను వివరణ కోరగా కందిపప్పులో పురుగుల విషయం తమ దృష్టికి వచ్చిందని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు క్రీడాసామగ్రి పంపిణీ


క్రీడాసామగ్రి పంపిణీ చేస్తున్న డీఎం శ్రావణి

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రాస్పెల్లి గ్రామపంచాయతీ పరిధి గెర్రెగూడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం అటవీ అభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ శ్రావణి క్రీడాసామగ్రి పంపిణీ చేశారు. విద్యార్థులకు చదువుతో పాటు మానసిక ఉల్లాసం కలిగించేందుకు కార్యక్రమాన్ని చేపట్టినట్లు డీఎం తెలిపారు. సర్పంచ్ బొమ్మెళ్ల పద్మ కిషన్, ప్లాంటేషన్ మేనేజర్ రాకేశ్, ప్రధానోపాధ్యాయులు సంతోష్, సత్యనారాయణ, శ్రావణ్‌కుమార్, వాచర్లు రమేశ్, పత్రు, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.సాయికుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899